# ఎన్నికల నిర్వహణకు ప్రత్యేక చర్యలు

- పోలింగ్ శాతం పెంచడమే లక్ష్యం
- చురుగ్గా ఏర్పాట్లు చేస్తున్న ఎన్నికల సంఘం




మెదక్, అక్టోబర్ 24 (నమస్తే తెలంగాణ): నవంబర్ 30న జరిగే అసెంబ్లీ ఎన్నికలను పారదర్శకంగా నిర్వహించడంతోపాటు పోలింగ్ శాతం పెంచేందుకు కేంద్ర ఎన్నికల సంఘం పలు చర్యలు చేపట్టింది. సాంకేతిక పరిజ్ఞానాన్ని మరింతగా వినియోగించి ఎన్నికలను పారదర్శకంగా నిర్వహించేందుకు శ్రీకారం చుట్టింది. గతంతో పోలిస్తే ఈసారి అసెంబ్లీ ఎన్నికల్లో మరిన్ని కొత్త పద్ధతులు, విధానాలను ఎన్నికల సంఘం ప్రవేశపెట్టింది. విచ్చలవిడిగా డబ్బు, మద్యం పంపిణీని అడ్డుకట్ట వేసేందుకు ఎన్నికల కమిషన్ సాంకేతిక పరిజ్ఞానం వినియోగానికి పెద్దపీట వేస్తున్నది. ఇందుకు ప్రత్యేకంగా సీ-విజిల్ అనే యాప్‌ను అందుబాటులోకి తీసుకొచ్చింది. ప్రస్తుతం దీనిపై ప్రజలకు విస్తృతంగా అవగాహన కల్పిస్తున్నారు.

## సీ విజిల్‌తో మరిన్ని ప్రయోజనాలు

ఎన్నికల్లో జరిగే అక్రమాలపై ఫిర్యాదు చేసేందుకు 2014లో ఎన్నికల సంఘం సీ విజిల్ యాప్‌ను ప్రవేశపెట్టింది. ప్రస్తుతం దీన్ని ఆధునీకరించడంతో పాటు ఎఫ్ఎస్‌టీ (ఫ్లయింగ్ స్క్వాడ్)తో అనుసంధానం చేసింది. అక్రమానికి సంబంధించిన ఫొటోను యాప్‌లో అప్‌లోడ్ చేస్తే 100 నిమిషాల్లో అధికారులు అక్కడికి చేరుకుని దర్యాప్తు చేసి, ఫిర్యాదుదారులకు సమాచారమిస్తారు. ఫిర్యాదుకు సంబంధించిన సమాచారం జిల్లా ఎన్నికల అధికారితో పాటు నియోజకవర్గ పరిధిలోని ఫ్లయింగ్ స్క్వాడ్‌కు చేరుతుంది. ఎన్నికల ఉల్లంఘనలపై ఫిర్యాదు కోసం సీ-విజిల్ యాప్ ఇన్‌స్టాల్ చేసుకోవాలి. ఫిర్యాదు దారుడి పేరు, చిరునామా పూర్తి వివరాలను అందించాల్సి ఉంటుంది. అనంతరం ఫిర్యాదుదారుడు ఫొటో లేదా గరిష్టంగా 2 నిమిషాల నిడివి గల వీడియోను యాప్‌లో అప్‌లోడ్ చేసి వివరాలు నమోదు చేయాలి. ఫిర్యాదుదారుడికి యాప్ నుంచి రెఫరెన్స్ నంబర్ వస్తుంది. ఈ ఐడీ ద్వారా మొబైల్‌లో ఫిర్యాదు స్థితిని తెలుసుకోవచ్చు. ఫిర్యాదుదారుడి వివరాలు అంత్యంత గోప్యంగా ఉంచుతారు. గతంలో రికార్డు చేసిన వీడియోలు, ఫొటోలు అప్‌లోడ్ చేసే అవకాశం ఉండదు.

## మై ఓటర్ హెల్ప్ లైన్ యాప్

ఓటర్లు తమ ఓటు ఏ కేంద్రంలో ఉందో తెలియకపోవడం, కుటుంబ సభ్యుల ఓట్లు వేర్వేరు చోట్ల ఉండడంతో ఓటింగ్ శాతం తక్కువగా నమోదవుతున్నట్లు ఎన్నికల సంఘం గుర్తించింది. ఈ నేపథ్యంలో మై ఓటరు హెల్ప్ లైన్ యాప్‌ను ప్రవేశపెట్టింది. ఈ యాప్‌ను ఫోన్‌లో సులభంగా డౌన్‌లోడ్ చేసుకుని ఓటరు కార్డు ఎపిక్ నంబర్ అందులో నమోదు చేస్తే ఏ పోలింగ్ కేంద్రంలో ఓటు వేసే అవకాశం ఉందనే వివరాలు తెలుస్తాయి.

## ఈసారి ముందే పోస్టల్ ఓటింగ్..

ఎన్నికల ప్రక్రియలో భాగస్వాములయ్యే అధికారులు, సిబ్బంది ఈ దఫా పోలింగ్ ప్రక్రియ ప్రారంభానికి ముందుగానే పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు హక్కును వినియోగించుకునే అవకాశం కల్పించారు. గతంలో పోస్టల్ బ్యాలెట్లను ఎన్నికల విధులకు హాజరయ్యే సమయంలో వేసేందుకు అవకాశం ఉండేది.

## యూత్ పోలింగ్ కేంద్రాలు

మహిళలు, దివ్యాంగుల ఓటు శాతం పెంపొందించే ఉద్దేశంతో గతంలో వీరికి ప్రత్యేక పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశారు. ప్రస్తుత అసెంబ్లీ ఎన్నికల్లో యువ ఓటర్ల సంఖ్య ఎక్కువగా ఉన్న ప్రాంతాల్లో యూత్ పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేయాలని ఎన్నికల సంఘం నిర్ణయించింది. వీటిని యువ అధికారులే నిర్వహించనున్నారు. మొదటిసారి నియోజకవర్గానికి ఒకటి చొప్పున ఏర్పాటు చేయనున్నారు.

## ఈసారి అభ్యర్థుల ఫొటోలు..

ఈవీఎంలపై అభ్యర్థుల ఫొటోలు పెట్టనున్నట్టు ఎన్నికల సంఘం ప్రకటించింది. తమ అభ్యర్థిని గుర్తించేందుకు వీలుగా ఎన్నికల సంఘం ఈవీఎంలో స్వల్ప మార్పులు చేసింది. గతంలో ఓటింగ్ యంత్రాలపై పార్టీ గుర్తు, అభ్యర్థి పేరు మాత్రమే ఉండేవి. త్వరలో జరగబోయే అసెంబ్లీ ఎన్నికల్లో అభ్యర్థుల ఫొటోలు ఉండనున్నాయి. పోస్టల్ బ్యాలెట్ పైనా ముద్రించేందుకు ఎన్నికల సంఘం చర్యలు చేపట్టింది.

# ఏడుపాయల్లో ముగిసిన శరన్నవరాత్రి ఉత్సవాలు


పలకీ సేవలో పాల్గొన్న నర్సాపూర్ ఎమ్మెల్యే మదన్ రెడ్డి


వనదుర్గా మాతను దర్శించుకున్న కలెక్టర్ రాజర్షి షా

- రాజరాజేశ్వరి దేవిగా ఏడుపాయల వనదుర్గమ్మ
- ఘనంగా కొనసాగిన అమ్మవారి నిమజ్జన శోభాయాత్ర

పాపన్నపేట, అక్టోబర్ 24: ముల్లోకాల మూలపుటమ్మ మమ్మేలు మాయమ్మ, చల్లంగ చూడమ్మ దుర్గమ్మ నామస్మరణతో ఏడుపాయల క్షేత్రం దద్దరిల్లింది. అందరిలో భక్తిభావం ఆధ్యాత్మిక వాతావరణం, ఇది దేశంలోనే రెండో వనదుర్గామాత ఆలయం. పాపన్నపేట మండలం ఏడుపాయల వన దుర్గా దేవి క్షేత్రంలో విజయదశమి రోజున వనదుర్గా మాతను దర్శించుకునేందుకు, నూతన, పాత వాహనాలకు పూజలు నిర్వహించేందుకు భక్తులు వేలాదిగా తరలివచ్చారు. దీంతోపాటు తొమ్మిది రోజులుగా అట్టహాసంగా కొనసాగిన దేవీ శరన్నవరాత్రి మంగళవారం నిర్వహించిన ఉత్సవాలతో ముగిశాయి. చివరి రోజు విజయదశమి సందర్భంగా వనదుర్గా మాతను రాజరాజేశ్వరి దేవీ రూపంలో మెరూన్ వస్త్రంతో అలంకరించారు. ఆలయ అర్చకులు ప్రత్యేక పూజలు చేసి భక్తులకు అమ్మవారి దర్శనం కల్పించి, తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఆలయంలోని గోకుల్ షెడ్డులో ప్రతిష్ఠించిన ఉత్సవ విగ్రహానికి పూజలు చేశారు. అనంతరం పల్లకీ సేవలో ఊరేగింపుగా తీసుకెళ్లి వన దుర్గామాత ప్రధాన ఆలయం ముందున్న ఏడుపాయల్లో ఒకటైన మంజీరా నది పాయల్లో నిమజ్జనం చేశారు. నిమజ్జనంలో ఆలయ పాలక మండలి చైర్మన్ బాలాగౌడ్, సభ్యులు, ఆలయ ఈవో మోహన్‌రెడ్డి, సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

**వనదుర్గామాతను దర్శించుకున్న కలెక్టర్, ఎమ్మెల్యే**

ఏడుపాయల వనదుర్గామాత సన్నిధిలో నిర్వహించిన నిమజ్జనానికి కలెక్టర్ రాజర్షి షా, నర్సాపూర్ ఎమ్మెల్యే మదన్‌రెడ్డి విచ్చేసి మాతను దర్శించుకున్నారు. నిమజ్జన కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం వారికి ఆలయ అర్చకులు సత్కరించారు.

# గజ్వేల్ మహంకాళికి ఘనంగా పట్టాభిషేకం

గజ్వేల్‌అర్బన్,అక్టోబర్23: గజ్వేల్ పట్టణంలో దసరా పండుగను ప్రజలంతా సోమవారం ఘనంగా జరుపుకున్నారు. గజ్వేల్‌లో ప్రజలంతా సీతారామాలయం నుంచి డప్పుచప్పుళ్లతో బయలుదేరి గజ్వేల్ మహంకాళి ఆలయానికి చేరుకున్నారు. ఆలయం వద్ద అమ్మవారిని దర్శించుకొని శమీ పూజ నిర్వహించారు. అనంతరం ఒకరికొకరు ఆలింగనం చేసుకొని బంగారం ఇచ్చిపుచ్చుకొని దసరా శుభాకాంక్షలు తెలుపుకున్నారు. మున్సిపల్ చైర్మన్ ఎన్‌సీ రాజమౌళి, ఆలయ కమిటీ అధ్యక్షుడు కాల్వ శ్రీధర్‌రావు, ఏసీపీ రమేశ్ తదితరులు ఆలయం వద్ద ఏర్పాటు చేసిన వేదికపై ప్రసంగించారు. ఆలయాభివృద్ధి, హైందవ సంస్కృతి అభివృద్ధికి ప్రతిఒక్కరూ కృషి చేయాలని ఈ సందర్భంగా ఆలయ ప్రధానార్చకులు చాడ నందబాలశర్మ పిలుపునిచ్చారు. ఆలయ పునర్నిర్మాణం తర్వాత ఉత్సవాలను వైభవంగా నిర్వహించుకుంటున్నామని తెలిపారు. ప్రతి ఏడాది ఉత్సవాలకు హాజరయ్యే ప్రజల సంఖ్య పెరుగుతున్నదని కాల్వ శ్రీధర్‌రావు అన్నారు. ప్రజలందరికీ ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ రాజమౌళి, పట్టణ ప్రముఖులు దసరా శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం రావణదహనం చేశారు.


ముమ్మాదేవి ఆలయంలో పూజలు చేస్తున్న ఎమ్మెల్యే చంటి క్రాంతికిరణ్

# ముమ్మాదేవి ఆలయాభివృద్ధికి కృషి

## అందోల్ ఎమ్మెల్యే చంటి క్రాంతికిరణ్


సమావేశంలో మాట్లాడుతున్న స్థానిక ఎమ్మెల్యే చంటి క్రాంతికిరణ్

రాయికోడ్, అక్టోబర్ 24: ముమ్మాదేవి ఆలయాభివృద్ధికి తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం తరఫున ప్రత్యేక కృషి చేస్తున్నదని ఎమ్మెల్యే చంటి క్రాంతికిరణ్ అన్నారు. సోమవారం రాయికోడ్‌లోని ముమ్మాదేవి ఆలయంలో నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఏర్పాటుచేసిన కార్యక్రమంలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఎమ్మెల్యే చంటి క్రాంతికిరణ్ మాట్లాడుతూ.. ఆలయంలో కమిటీ హాల్ నిర్మాణం చేపట్టనున్నట్లు తెలిపారు. నిరంతరం ప్రజా సంక్షేమమే ధ్యేయంగా పని చేస్తున్న బీఆర్ఎస్‌ను గెలించాలని పిలుపునించారు. అన్ని వర్గాల సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకుని సీఎం కేసీఆర్ మ్యానిఫెస్టో రూపొందించారన్నారు. సమావేశంలో ఆలయ కమిటీ చైర్మన్, మాజీ సర్పంచ్ లక్ష్మణ్, జడ్పీటీసీ మల్లికార్జున్ పాటిల్, డీసీఎంఎస్ మాజీ చైర్మన్ సిద్దన్న పాటిల్, రాయికోడ్ మార్కెట్ కమిటీ చైర్మన్ విజయలక్ష్మి, ఆత్మ కమిటీ చైర్మన్ విఠల్, బీఆర్ఎస్ అధ్యక్ష, కార్యదర్శులు బస్వరాజు పాటిల్, శంకర్, వరం వైస్ చైర్మన్ తుకారం కురుమ, ఆత్మ కమిటీ చైర్మన్ విఠల్, ఎంపీటీసీలు శివకుమార్ పాటిల్, నిరంజన్, ఎంపీపీ కో- ఆప్షన్ మెంబర్ అబేదలి, వీరభద్రేశ్వరస్వామి అలయ కమిటీ చైర్మన్ సంగమేశ్వర్ పాటిల్, నాయకులు ప్రశాంత్ పాటిల్, ఆలయ కమిటీ సభ్యులు బాలరాం, బాబు, శ్యాం, శ్రీనివాస్, శేఖర్, వెంకటేశం ఉన్నారు.

## కొమురవెల్లిలో ముగిసిన ఉత్సవాలు

చేర్యాల, అక్టోబర్ 24 : కొమురవెల్లి ఆలయంలో దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు మంగళవారం ముగిశాయి. ఈ సందర్భంగా దుర్గామాత విగ్రహాన్ని ఊరేగించి దేవాలయ పుష్కరిణి(ధర్మగుండం) వరకు తీసుకెళ్లి త్రిశూల స్నానం చేయించారు. ఆలయ ఏఈవో వైరాగ్యం అంజయ్య, పర్యవేక్షకుడు చంద్రశేఖర్, ఆలయ ప్రధాన అర్చకులు మల్లికార్జున్ ఉన్నారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్
WANTED
★ రామకృష్ణ గ్రూప్ (TS & AP No. 1) Hyd., VJA. శ్రీమంతుల ఇండ్లలో వృద్ధుల సేవకు ఇంటి/వంట పని, బేబీకేర్ కొరకు వర్కర్లు (M/F) కావలెను. భో+వ+జీతం: 15-21 వేలు. ఏజెంట్లకు కమీషన్: 5,000/-. Ph: 9281452833, 6281208600.
NT-320535

గమనిక: క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్/డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

మన రాష్ట్రం మన పత్రిక
నమస్తే తెలంగాణ
Telangana Today
FOR LOCAL TO GLOBAL NEWS
పుట్టినరోజు, పదవీ విరమణ, వార్షికోత్సవ శుభాకాంక్షలు,
వర్ధంతి, జయంతి, లీగల్ నోటీసులు
మరియు ఇతర ప్రకటనల కొరకు
ఈ దిగువ తెలిపిన నెంబర్లపై సంప్రదించగలరు.
ప్రకటనల విభాగం సెల్: 80966 77655
సిద్దిపేట/గజ్వేల్/తూప్రాన్/మెదక్ : 80966 77663
సంగారెడ్డి/జహీరాబాద్/నారాయణఖేడ్ : 9182777658
పటాన్‌చెరు : 80966 77657